క్లుప్తంగా

తిరుమలకు భక్తుల పాదయాత్ర


భక్తులకు స్వాగతం పలుకుతున్న స్థానికులు

వీరబల్లి : మండలంలోని వంగిమళ్లకు చెందిన అనగాని రామ్మోహన్, శ్రీనివాసులు ఆధ్వర్యంలో యాభై మంది భక్తులు ఆదివారం పాదయాత్రగా తిరుమలకు బయలుదేరారు. పాదయాత్ర వీరబల్లికి చేరుకోగానే స్థానిక నాయకుడు శ్రీధర్ రెడ్డి సహకారంతో భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం పానీపూరి శ్రీనివాసులు కుటుంబ సభ్యులు భక్తులకు భోజన వసతి కల్పించారు. ఈ పాదయాత్ర నాలుగురోజులపాటు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌డీఎస్ సురేంద్రారెడ్డి, హరిహరాదుల దేవస్థానం కమిటీ సభ్యుడు శ్రీనివాసులు, పవన్ కుమార్ రెడ్డి, అనగాని నాగభూషణం, రాధాకృష్ణ, ఏడుకొండలు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ మహాసభను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న నరసయ్య


రైల్వేకోడూరు అర్బన్ : ఈనెల 9వ తేదీన రాయచోటిలో జరగనున్న ఏఐవైఎఫ్ మహాసభలను విజయవంతం చేయాలని నియోజకవర్గ అధ్యక్షులు నరసయ్య ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొట్టమొదటిసారి రాయచోటిలో ఈనెల 9వ తేదీన జరిగే మహాసభలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో దార్ల రాజశేఖర్, డి.చైతన్య, నరసయ్య, సుధీర్, గణేష్, హరి, వినయ్, శివ, యువరాజ్, వెంకటేష్, రాజా తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్య వికాసానికి ప్రాధాన్యత ఇవ్వాలి


ఎంఈఓను అభినందిస్తున్న జేసీ రాజేంద్రన్

సుండుపల్లె : విద్యార్థుల్లో నైపుణ్య వికాసానికి ఉపాధ్యాయులు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జేసీ ఆదర్శ్ రాజేంద్రన్ పేర్కొన్నారు. ఆదివారం ఎఫ్‌ఎల్ఎన్‌లో భాగంగా రాయచోటి అర్బన్ కళాశాలలో రూమ్ నెంబరు-1 తరపున వేసిన సమగ్ర నైపుణ్యాల అభివృద్ధికి సంబంధించి వేసిన ముగ్గుకు ఎంఈఓ రవీంద్ర నాయక్‌ను ప్రత్యేకంగా అభినందిస్తూ బహుమతి ప్రదానం చేశారు. పిల్లలు మార్గదర్శకంగా ఎదగడానికి నైపుణ్యాలు, భాషాభివృద్ధి, సామాజిక, భావోద్వేగ అభివృద్ధికి, మేధో వృద్ధికి ముగ్గుల ద్వార సరళతర బోధన అందించడం మార్గదర్శకంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, రాష్ట్ర మంత్రి రాంప్రసాద్ రెడ్డి సతీమణి హరిత, సుండుపల్లి ఎంఈఓ రవీంద్ర నాయక్‌లను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో డీఆర్‌పీలు రామ్మోహన్, శివప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు కృషి


జేవీవీ క్యాలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థల నేతలు

రాయచోటి అర్బన్ : విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు జన విజ్ఞాన వేదిక నేతలు కృషి చేస్తుండడం అభినందనీయమని మానవత సంస్థ రాష్ట్రకమిటీ సభ్యుడు సహదేవరెడ్డి అన్నారు. జేవీవీ ఆధ్వర్యంలో రూపొందించిన సైన్స్ క్యాలండర్‌ను ఆదివారం పట్టణంలోని విజ్ఞాన్ స్కూల్‌లో ఆవిష్కరించారు. కంటి వైద్యులు రెడ్డెన్న మాట్లాడుతూ సైన్స్ క్యాలండర్‌లో శాస్త్రవేత్తల ఫోటోల ముద్రణతోపాటు వారి కృషిని తెలియజేసేలా ముద్రించడం విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి, డైట్ అధ్యాపకులు వై.సి.రెడ్డెప్పరెడ్డి, అసదుల్లాబాషా, లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు హరినాథరెడ్డి, పాఠశాల హెచ్ఎంలు శివయ్య, బయారెడ్డి, శేషారెడ్డి, జేవీవీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంధోత్సవం

ములకలచెరువు: మండలంలోని పెద్దపాళ్యంలో వెలసిన హజరత్ సయ్యద్ సులేమాన్ షావలి ఉరుసు ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గంధ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మతగురువులు గంధంను పెద్దపాళ్యం పీర్ల చావిడి నుంచి తీసుకువచ్చి ప్రత్యేకంగా ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొని తరించారు.

• సారూ.. ఇటు చూడరూ..


గొల్లపల్లికి వెళ్లే దారిలో విరిగిన రోడ్డు

నందలూరు మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ గొల్లపల్లికి వెళ్లే దారిలోని కాలువ తూము వద్ద రోడ్డు ఒరిగి కాలువలోకి పడిపోవడంతో పెను ప్రమాదం జరిగే అవకాశం ఉందని ఆ ప్రాంత వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆ దారిలో వెళ్లే వాహనాలకు, స్కూల్ బస్సులకు ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని పలువురు విచారం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి రోడ్డు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

• కాలం చెల్లిన కల్వర్టు!

మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ శివారులోని వంతెన(కల్వర్టు) కూలేందుకు సిద్ధంగా ఉంది. చెయ్యేరు నుంచి నాగిరెడ్డిపల్లి ఎర్రచెరువుకు నీరు అందించే ఈ కల్వర్టును ప్రమాదానికి గురైతే తోగురుపేట, పాటూరు గ్రామాలకు చెందిన వారు మండల కేంద్రానికి రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. అధిక లోడుతో ఉన్న వాహనాలు ఈ కల్వర్టుపై వెళ్తే ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్, గ్రామస్తులు ఎల్లటూరు శివరామరాజు, ధనుంజయ నాయుడు, బలరామిరెడ్డి, పాటూరు రమేష్‌లు కోరారు.

– నందలూరు


కూలేందుకు సిద్ధంగా ఉన్న కల్వర్టు

హామీలు నెరవేర్చకుంటే ప్రజలే బుద్ధి చెబుతారు


రాజంపేట రూరల్: ఆకేపాటిని సత్కరిస్తున్న ఎన్నారై కేకే రెడ్డి


పుల్లంపేట: వైఎస్సార్‌సీపీ నాయకులతో మాట్లాడుతున్న ఆకేపాటి

పుల్లంపేట : మండల పరిధిలోని వత్తలూరు గ్రామ పంచాయతీలో ఆదివారం బొమ్మవరం ప్రతాప్ రెడ్డి తల్లి మృతి చెందారు. విషయం తెలుసుకున్న అన్నమయ్య జిల్లా అధ్యక్షులు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్ రెడ్డి గ్రామంలోని వైఎస్సార్ సీపీ నాయకులతో సమావేశమై మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఆరు నెలలు పూర్తయినప్పటికీ ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. రైతులకు రైతు భరోసా ఇవ్వకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుంటే రాబోయే రోజుల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కుమార్ రెడ్డి, విశ్వనాథ రెడ్డి, దండు గోపి, సౌమిత్రి, కల్యాణ్ రెడ్డి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కేకేరెడ్డి సేవలు స్ఫూర్తిదాయకం

రాజంపేట రూరల్ : సొంతూరి రుణం తీర్చుకునేందుకు ఎన్నారై కేకే రెడ్డి చేస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డిలు కొనియాడారు. పెద్దకారంపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలకు రూ.10 లక్షల విలువ చేసే సామగ్రిని కేకేరెడ్డి వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆదివారం ఆ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆకేపాటి, పోలా పాల్గొని మాట్లాడారు. మన్నూరు రామలక్షుమ్మ, మన్నూరు నారాయణరెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా కేకే రెడ్డి తన సొంత గ్రామానికి, తాను చదువుకున్న పాఠశాల అభివృద్ధికి హితోధికంగా తన సొంత డబ్బులు ఖర్చు చేస్తుండటం ఎంతైనా అభినందనీయమని కొనియాడారు. నేటి యువత తమ సంపాదనలో కొంత సొంత సామాజిక సేవా కార్యక్రమాలకు ఖర్చు చేస్తే అనేక గ్రామాల్లో మౌలిక వసతులు సమకూరుతాయని తెలియజేశారు. కేకేరెడ్డి మాట్లాడుతూ రెండురోజుల క్రితం తాను పెద్దకారంపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించినప్పుడు హెచ్ఎం ఎస్ఎస్.రాజు విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకొచ్చారని, అందువల్ల తనవంతు వారికి అవసరమయ్యే పరికరాలను తీయించినట్లు చెప్పారు. అనంతరం ఆయన ఎమ్మెల్యే ఆకేపాటిని సత్కరించారు. కార్యక్రమంలో వీరబల్లి ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్‌రెడ్డి, యువ నాయకుడు గాలివీటి మదన్‌మోహన్‌రెడ్డి, మన్నూరు సుబ్బారెడ్డి, మన్నూరు నారాయణరెడ్డి, శుభోద్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, బాలాజీ, శివరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నివాళి

నందలూరు : మండలంలోని పాటూరు గ్రామానికి చెందిన బొప్పరాజు చెంగల్‌రాజు మృతి చెందడం బాధాకరమని రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన చెంగల్‌రాజు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట అరిగెల సౌమిత్రి, గుండు మల్లికార్జున రెడ్డి, బూసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, ఆకేపాటి జగదీశ్వర్ రెడ్డి, అరిగె హరిబాబు, నరసింహారెడ్డి, మహేంద్ర రాజు, నాగవాసు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ పటిష్టత కోసం కృషి చేయాలి


రైల్వేకోడూరు అర్బన్: సుకుమార్ రెడ్డిని అభినందిస్తున్న ధ్వజారెడ్డి, నాయకులు


ఓబులవారిపల్లె: కృష్ణారెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఓబులవారిపల్లె : కష్టపడిన వారికి వైఎస్సార్‌సీపీలో సముచిత స్థానం ఉంటుందని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు టంగుటూరు కృష్ణారెడ్డి అన్నారు. శనివారం వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో ప్రకటించిన జిల్లా కమిటీలో కృష్ణారెడ్డికి పార్టీ జిల్లా ఉపాధ్యక్ష పదవి దక్కింది. ఆదివారం మండలంలోని పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఆయన్ను కలుసుకుని అభినందనలు తెలిపి ఘనంగా సత్కరించారు. కృష్ణారెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఇచ్చిన జిల్లా ఉపాధ్యక్ష పదవి పార్టీ శ్రేణులను కలుపుకొని సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ఎన్‌పీ జయపాల్ రెడ్డి, మల్లెం ఈశ్వరయ్య, డీఆర్‌యూసీసీ మెంబర్ తల్లెం భరత్ కుమార్ రెడ్డి, ఎంపీటీసీ పైడి గిరినాయుడు, నాయకులు టంగుటూరి సుధాకర్ రెడ్డి, సుబ్రమణ్యం రెడ్డి, గోపి తదితరులు పాల్గొన్నారు.

కోడూరులో..

రైల్వేకోడూరు అర్బన్ : వైఎస్సార్‌సీపీ పటిష్టత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పంజం సుకుమార్ రెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధిగా నియామకమైన ఆయన్ను ఆదివారం వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, తదితర నాయకులు కలిశారు. ఈ సందర్భంగా పంజంను ఘనంగా సత్కరించారు. అలానే జిల్లా కమిటీలో పొందిన సుబ్బరామరాజు, టంగుటూరు కృష్ణారెడ్డి తదితరులను సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు సీహెచ్ రమేష్, సర్పంచ్ హరికృష్ణారెడ్డి, ఎంపీటీసీ ప్రసాద్ రెడ్డి, కృష్ణారెడ్డి, గురువురెడ్డి, రాజారెడ్డి, సిద్దయ్య, డీపీ రమణ, సుబ్రమణ్యం, శంకర తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ నోటిఫికేషన్‌ను రద్దుచేయాలి


మాట్లాడుతున్న రామాంజులు

రాయచోటి అర్బన్ : ఇటీవల విడుదల చేసిన అంగన్‌వాడీ నియామకాల నోటిఫికేషన్‌ను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ఏడాది డిసెంబరు 23న అన్నమయ్య జిల్లాలోని 11 అంగన్‌వాడీ వర్కర్‌లు, 93 హెల్పర్, 12 మినీ వర్కర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌ను ఇచ్చారన్నారు. మదనపల్లె ప్రాజెక్టు పరిధిలోని వేంపల్లె, కురవ పల్లె కేంద్రాలలో హెల్పర్‌లకు ప్రమోషన్‌కు అర్హత ఉన్నా వర్కర్‌గా ప్రమోషన్ ఇస్తామని చెప్పి ఇవ్వకుండా నోటిఫికేషన్ ఇచ్చారన్నారు. అప్పారావుతోట కేంద్రానికి జీఓ ప్రకారం ట్రాన్స్‌ఫర్ పెట్టుకున్న వర్కర్‌కు మొండిచేయి చూపించి ఇతరులతో సొమ్ముచేసుకునే పనిలో అధికారులు ఉన్నారంటూ ఆరోపించారు. అనేక చోట్ల రోస్టర్‌లను ఇష్టానుసారంగా మార్చేశారన్నారు. ఈ అక్రమ నోటిఫికేషన్ వలన హెల్పర్ రిటైర్ అయ్యే వరకు హెల్పర్‌గానే పనిచేయాల్సి ఉంటుందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగబద్ధంగా ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న ప్రమోషన్, ట్రాన్స్‌ఫర్ జీఓలను అమలు చేయకుండా వర్కర్‌లు, హెల్పర్‌లకు అన్యాయం చేసే నోటిఫికేషన్‌ను వెంటనే రద్దుచేయాలంటూ డిమాండ్ చేశారు. నోటిఫికేషన్‌ను రద్దుచేయని పక్షంలో జిల్లావ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాయచోటి ప్రాజెక్టు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిద్దమ్మ, భాగ్యలక్ష్మి, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు రాంబాబులు పాల్గొన్నారు.

భూ సమస్యలను నిర్లక్ష్యం చేయరాదు


చిన్నమండెం: ప్రజాదర్బార్‌లో అర్జీలను స్వీకరిస్తున్న మంత్రి మండిపల్లి

చిన్నమండెం : అధికారులు భూ సమస్యలను నిర్లక్ష్యం చేయరాదని రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం చిన్నమండెం మండలం బోరెడ్డిగారిపల్లెలోని మంత్రి నివాసం నందు ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో భూ సమస్యలు అధికంగా ఉన్నాయని, వాటి పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న రెవెన్యూ సదస్సుల ద్వార వచ్చిన ప్రతి అర్జీని పరిశీలించి భూ సమస్యలను పరిష్కరించాలన్నారు. జిల్లా నలుమూలల నుంచి అర్జీదారులు నుంచి మంత్రికి అర్జీలు స్వీకరించి వాటిని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

ఒకటవ తేదీనే జీతాలు చెల్లించండి

సంబేపల్లె : ఉపాధ్యాయులకు ప్రతి నెల ఒకటవ తేదీన ఉపాధ్యాయుల జీతాలు చెల్లించాలని ఉపాధ్యాయ సంఘం నాయకులు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం వారు చిన్నమండెంలోని బోరెడ్డిగారిపల్లెలోని మంత్రి నివాసంలో ఆయన్ను కలుసుకుని మాట్లాడారు. ప్రతి నెల ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న డీఏలు, ఐఆర్, పీఆర్సీ సవరణ తదితర సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టేలా చూడాలని మంత్రిని కోరారు. అనంతరం ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు రామాంజులు, శివహరి, రెడ్డప్పరెడ్డి, నాయక్ పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఆప్కాస్‌లోకి తీసుకోండి


బొప్పరాజు వెంకటేశ్వర్లకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మండల ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

చిన్నమండెం : రాష్ట్ర ప్రభుత్వ శాఖలలో పనిచేసే లక్షలాది మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఆప్కాస్‌లోకి తీసుకోవాలని ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లుకు మండల పరిధిలోని పలువురు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు వినతి పత్రం అందజేశారు. ఆదివారం విజయవాడ లెనిన్ సెంటర్‌లోని రెవెన్యూ భవన్‌లో ఏపీ జేఏసీ అమరావతి అనుబంధంగా ఉన్న కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ, 26 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులతో రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఇందులో మండల పరిధిలోని పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు. మెప్మా, సెర్ప్‌లలో పనిచేస్తున్న ఉద్యోగుల లాగానే అభద్రతా భావంతో, చాలీచాలని జీతాలతో, ప్రభుత్వాలు నిర్దేశించిన కార్యక్రమాలు అంకితభావంతో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా హెచ్ఆర్ పాలసీ అమలు చేసేలా ప్రభుత్వానికి తెలియజేయాలని బొప్పరాజుకు తెలియజేశారు. ఏళ్ల తరబడి ప్రభుత్వ శాఖల్లో తక్కువ జీతానికి పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సీనియారిటీ ప్రాతిపదికన ప్రతి సంవత్సరం ఎంతో కొంత ఇంక్రిమెంట్ ఇస్తూ వేతన వ్యత్యాసాన్ని అమలు చేసి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

8న ఐటీఐలో జాబ్ మేళా

తంబళ్లపల్లి: స్థానిక టీఎన్ వెంకటసుబ్బారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 8వతేదీన జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసులు రెడ్డి , స్కిల్‌హబ్ కోఆర్డినేటర్ చౌడయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడీప్ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఉదయం 10 గంటల నుంచి జాబ్‌మేళా నిర్వహిస్తారన్నారు. ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, పీజీ చదివిన నిరుద్యోగ యువతీ, యువకులు అర్హులన్నారు. 18 సంవత్సరాలపైన 30 సంవత్సరాల వయస్సులోపు కలిగిన వారు బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ జిరాక్సు కాపీ, పాస్‌ఫోర్టు సైజ్ ఫొటోలతో నేరుగా ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు.

విలేకరికి టీడీపీ నాయకుడు బెదిరింపులు

తాము చెప్పిందే రాయాలని.. వ్యతిరేకంగా రాయకూడదంటూ హుకుం

సాక్షి టాస్క్‌ఫోర్స్ : పుల్లంపేట మండలంలో ఆదివారం టీడీపీ నాయకుడు ఓ విలేకరిని (సాక్షి కాదు) బెదిరించడంతో సోషల్ మీడియాలో హల్‌చల్ అయ్యింది. వివరాల్లోకి వెళ్తే పుల్లంపేట విద్యుత్‌శాఖ ఏఈగా శివప్రసాద్ విధులు నిర్వర్తిస్తున్నారు. ఈనెల 3వ తేదీ రైల్వేకోడూరు శాసనసభ్యులు, ప్రభుత్వవిప్ అరవ శ్రీధర్ ఏఈకి ఫోన్ చేయగా ఏఈ ఫోన్ కిందపడి డిస్‌ప్లే పోయినందున సమాధానం ఇవ్వలేదు. ఇదే విషయాన్ని సదరు అధికారి ఎమ్మెల్యేకు వివరణ కూడా ఇచ్చారు. ఇదే విషయంపై స్పందించి వార్త రాసిన విలేకరికి రామక్కపల్లికి చెందిన టీడీపీ నాయకుడు మణి ఫోన్ చేసి బెదిరింపుల పర్వానికి దిగాడు.

సోషల్ మీడియాలో పోస్టు చేస్తావా..

ఏఈ ఎమ్మెల్యే మధ్య జరిగిన సంఘటనను సోషల్ మీడియాలో ఎలా పోస్టు చేస్తావంటూ ఆగ్రహం వ్యక్తం చేశాడు.

మేమేంటో నీకు బాగా తెలుసు కదా.. అలాంటి మాపై వ్యతిరేకంగా వార్త రాస్తావా అంటూ మాట్లాడినా ఆడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. తాను ఎవరికి భయపడే వ్యక్తిని కాదని, మీ సంగతి అంత తెలుసని.. తాము చెప్పిందే రాయాలని లేకుంటే పరిణామాలు వేరేలా ఉంటాయని బెదిరించాడు. టీడీపీ నాయకుడు విలేఖరిని బెదిరించిన ఆడియోపై మండలంలోని ప్రజలు చర్చించుకుంటున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు విలేకరులపై దాడులు చేసినా, బెదిరించినా అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపినా టీడీపీ నాయకులు పట్టించుకోకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్న అనేది తెలియవస్తోంది. విలేకరులను బెదిరించిన వారిపై ప్రభుత్వం ఎంతవరకు చర్యలు తీసుకుంటుందో వేచి చూడాల్సిందే.

అబ్బురపరుస్తున్న మంచు అందాలు!


మంచు తీవ్రతకు కనిపించని జెడ్పీహెచ్ఎస్ భవనం (ఇన్‌సెట్) షటిల్ ఆడుతున్న దృశ్యం

ఓబులవారిపల్లె: నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాలను మంచు దుప్పటి కప్పడంతో ఊటిని తలపిస్తున్నాయి. గత మూడు రోజుల నుంచి చలి తీవ్రత పెరగడంతోపాటు ఉదయం 9 గంటల వరకు సూర్యుడి జాడ కనిపించకపోతోంది. దీంతో ప్రజలు దట్టమైన పొగమంచులో బయటకు కూడా రావడంలేదు. దట్టమైన పొగమంచు కారణంగా జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్నా వాహనాలు కనిపించక పోతుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నడూ లేని విధంగా ప్రతిరోజూ పొగమంచు కప్పేయడంతో మండలంలోని గ్రామీణ ప్రాంతాలు హిల్ స్టేషన్‌ను తలపిస్తున్నాయి.

కమనీయం.. ప్రసన్న రంగనాథ కల్యాణం



స్వామివారి కల్యాణాన్ని జరిపిస్తున్న వేదపండితులు


రాజంపేట టౌన్ : పట్టణంలోని తోట కల్యాణ మండపంలో ఆదివారం గోదాదేవి, మహాలక్ష్మీదేవి సమేత ప్రసన్న రంగనాథ స్వామి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత కల్యాణ ఉత్సవ మూర్తులను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై కొలువుదీర్చారు. అనంతరం వేద పండితులు వేదమంత్రోచ్ఛరణల నడుమ స్వామివారి కల్యాణ క్రతువును కమనీయంగా జరిపించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి కల్యాణాన్ని తిలకించారు. తొలుత గోమాత పూజ, తులసీ పూజతోపాటు ఆధ్యాత్మికత ఉట్టిపడేలా సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలను ఏర్పాటు చేశారు.


కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

రైతులను సుభిక్షంగా చూడు తల్లీ గంగమ్మా


సిద్దవటం: పూజలందుకున్న ఇరుగులమ్మ


సంబేపల్లె: ప్రత్యేక అలంకరణలో నల్లగంగమ్మ


లక్కిరెడ్డిపల్లి: దర్శనమిస్తున్న అనంతపురం గంగమ్మ

లక్కిరెడ్డిపల్లి : రైతులు, ప్రజలు సుభిక్షంగా ఉండేలా కరుణించి కాపాడు తల్లీ అంటూ ఆదివారం గంగమ్మకు భక్తులు పూజలు చేశారు. కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా విరాజిల్లుతున్న అనంతపురం గంగమ్మ దర్శనానికి భక్తులు తరలివచ్చారు. చుట్టుపక్కల ప్రాంతాల వారే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ పూజారులు చెల్లు వంశీయులు భక్తులకు అమ్మవారి దర్శన భాగ్యాన్ని కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సంబేపల్లె : మండల కేంద్రంలోని శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ ఆలయంలో ఆదివారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు కాయాకర్పూరం అందజేసి పూజలు చేయించారు. ఆలయం ముందు భాగంలో బీజాక్షరాలతో కలిగి ఉన్న మహిమగల రాయిని భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం బంధు, మిత్రులతో కలసి విందును ఆరగించారు.

సిద్దవటం : మండల కేంద్రం శివారులో వెలసిన ఇరుగులమ్మకు ఆదివారం భక్తులు పూజలు నిర్వహించారని ఆలయ పూజారి వెంకటరమణ అన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకం, అలంకరణ, సహస్ర నామార్చన, కుంకుమార్చన తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించామన్నారు. కొందరు భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కుబడులను చెల్లించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.